# శీతలమైపోయిన సీతమ్మ మనసు

ఆ రోజు హైదరాబాదు నుంచి కొడుకు శేఖర్, కోడలు రేఖ వస్తున్నారు. సీతమ్మ మనసు వసంతంలో మల్లెపందిరిలా విరబూసింది. ముందు రోజే పెరడంతా తుడిపించింది. రకరకాల పండ్లచెట్లకు అరటి చెట్లకు పాదులు తీయించి నీళ్లు పోయించింది. వీధుల్లోని పూల చెట్లకు నీళ్ళు పోసింది. ఇంటి ముందు వెలుగు రాకుండానే కళాపు జల్లించి ముగ్గులు పెట్టించింది.

అంతలో తూర్పువాకిలి తెరుచుకుని దూసుకువచ్చే ఓ వెలుగు కిరణంలా కారు హారన్ చేసుకుంటూ వచ్చి ఇంటిముందు ముగ్గుల మధ్యలో ఆగింది. ఒక్కగా నొక్కకొడుకు కారు దిగి వస్తుంటే ఆనందం పట్టలేని సీతమ్మ కళ్ళు చెమర్చాయి.

"అమ్మా! బాగున్నావా?" శేఖర్ తల్లి చెయ్యి పట్టుకుని పలకరించాడు. సీతమ్మ శరీరం మాతృ ప్రేమతో పులకరించింది.

"నే బాగున్నారా! మీరిద్దరు బాగున్నారా?" అంటూనే ఆ తల్లి కొడుకును నడిపించుకుంటూ ఇంట్లోకి అడుగు పెట్టింది. కోడలు వారి వెంటనడిచింది. గుమ్మాలకు కట్టిన పచ్చని మామిడి తోరణాలు గాలికి ఊగుతూ స్వాగతం పలికాయి.

చాలాకాలం తరువాత కోడలితో వచ్చిన కొడుకుని దులిపెయ్యాలను కుంది కాని, కొడుకును చూసిన తర్వాత ఆమె కోపం నీళ్లుపోసిన నిప్పులా చల్లారిపోయింది. ఆప్యాయత చిలుకుతూ కబుర్లు చెప్పింది.

చాలాకాలం తరువాత వచ్చిన శేఖర్‌ని పలకరించడానికి పల్లెజనం కదలి వచ్చారు. శేఖర్ పుట్టి పెరిగిన ఊరది. ఎంతో అభిమానంతో అందరిని పలకరించి పంపించాడు.

"ఏమిటో? ఛీ! ఛీ! పల్లె గబ్బిలాలు పట్టుకుంటే వదలవు! వేళాపాళాలేదు!" రేఖ విసుక్కోవడం సీతమ్మ చెవిన పడింది. "పట్నం పిల్లలు ఇంతే?" సీతమ్మ

సరిపెట్టుకోడానికి ప్రయత్నించింది. అనుభవాలతో పండిపోతున్న మనసు ఆమెది. అంతలో రైతు వచ్చాడని తెలిసి శేఖర్ వీధిలోకి వెళ్ళాడు. రైతుతో మాట్లాడి పంపించి శేఖర్ తిరిగి లోపలికి వచ్చాడు.

"ఏమండీ! మీరసలు నా సంగతి పట్టించుకోరా? ఈ యింట్లో బాత్‌రూమే లేదు. ఎక్కడో దూరంగా ఆ పెరట్లో ఏడిసింది. అంత దూరం వెళ్ళి స్నానం చేసి రావడం నాకు చేతకాదండీ! నేను ఇక ఒక్కరోజు కూడా ఇక్కడ ఉండలేను. తిరిగి వెళ్ళిపోతాను.

"రేఖా! ముందే చెప్పాగా! ఇక్కడ వాళ్ళు హాయిగా ఉంటున్నారుగా! సర్దుకుపోవడం నేర్చుకోవాలి. మా అమ్మ వింటే బాధపడుతుంది.

"నాకు ఇక సర్దుకుపోయే శక్తిలేదు. పెళ్ళయిన తరువాత మూడు నిద్రలకు వచ్చినప్పుడు సర్దుకున్నా! మీరు నాతో వస్తున్నారా? లేదా?" రేఖ భర్తను నిలదీసింది. ఆ మాటలూ వింది సీతమ్మ.

"అమ్మో! కోడలు పిల్ల సామాన్యమైనది కాదు! ఈమె వక్రరేఖ సీతమ్మ మనసు వికలమైపోయింది. అయినా శక్తిని కూడ దీసుకుని మసలింది

"రేఖా! చిన్న పిల్లలా అల్లరి చెయ్యకు! అప్పుడు కూడా నువ్వున్నది ఒక్కరోజేగా! సరే రేపే వెళ్ళిపోదాం!" రేఖ మనసు ఆ మాటలకు వికసించింది.

"అమ్మా! రేపే మన ప్రయాణం. నువ్వుకూడా మాతో వస్తున్నావుగా! సామాను సర్దుకో! రాత్రి భోజనం చేస్తూ శేఖర్ తల్లితో గబగబా చెప్పేసాడు.

"అదేమిట్రా బాబూ! నాలుగు రోజులు ఉంటామన్నావుగా? అప్పుడే తిరుగు ప్రయాణం ఏమిటి?" ఆవిడ కొడుకు సమాధానం కోసం ఎదురు చూసింది.

ఉందామనే అనుకున్నా కాని నాకు శలవు దొరకలేదమ్మా! అతని మాటలు పొడి పొడిగా ఉన్నాయి. ప్రయాణానికి తల్లి అనుకూలంగానే ఉంది అప్పుడే చెప్పవలసింది చెప్పాలనుకున్నాడు.

"అమ్మా! నువ్వు వంటరిగా ఇక్కడెందుకు? నువ్వు మాతోనె ఉందువుగాని. ఇంక ఇక్కడ ఈ యిల్లు భూములు ఎందుకు? అమ్మేద్దామా అమ్మా!" కొడుకు మాటలకు ఆవిడ మనస్సు ఉలిక్కిపడింది.

"అదేమిట్రా! నేను మీతో వచ్చి ఉండటానికి మీతాతలు ఇచ్చిన ఈ ఆస్తి అమ్మడం దేనికి? నేను మీ దగ్గరకు వచ్చి వెడుతూంటాలే?" అందావిడ లేని నవ్వు తెచ్చుకుని.

"అది కాదమ్మా!"

"ఇంకేమి చెప్పకు శేఖర్! నేను ఈ మట్టిలో కలిసిపోయాకే ఇల్లు అమ్ముకోండి!" ఆమె విస విసా నడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

"అనవసరంగా తొందరపడ్డానేమో?" శేఖర్ మనసులోనే బాధపడ్డాడు. ఇంకెప్పుడు తల్లి దగ్గర ఆ విషయం ప్రస్తావించ కూడదనుకున్నాడు.

తెల్లవారగానే చీకటిపోయి వెలుగు పంచుకున్నట్లే అందరి మనసులు కుదుటపడ్డాయి. సీతమ్మగారు పెరట్లో పండిన కూరలు, అరిటాకులు కోయించి కార్లో సర్దించింది. రూకమ్మకు ఇల్లు జాగ్రత్తగా చూడమని పదిసార్లు చెప్పింది. ఇరుగు పొరుగులకు చెప్పింది. ఆమె అందరికి ఆ యింటిని కని పెట్టుకుని ఉండమని చెప్పింది. కాని కారు బయలు దేరుతుంటే ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"రాక్షసుడి ప్రాణం రామచిలుకలో ఉన్నట్టు సీతమ్మ ప్రాణాలు ఈ యింటిమీదే ఉంటాయి!" అనుకున్న ఇరుగు పొరుగు వారికళ్ళు చెమర్చాయి. పాలపిట్ట ఒకటి కారు పై నుంచి ఎగురుతూ వెళ్ళిపోయింది. కారు ముందుకు దూసుకు వెళ్ళింది.

8 గంటలు ప్రయాణం చేసి కారు హైదరాబాదులో వారి ప్లాటు ముందు ఆగింది. శేఖర్, రేఖ కారు దిగి కొంత సామాను పట్టుకుని లిఫ్ట్ ఎక్కారు. సీతమ్మకూడా వారి వెంటే ఉంది. శేఖర్ బటన్ నొక్కగానే లిఫ్ట్ పైకి బయలు దేరింది. ఎప్పుడు లిఫ్టు చూడని సీతమ్మ ఆశ్చర్యంగా చూసింది. "ఈ పట్నంలో ఎన్ని చిత్రాలో? అన్నీ మానవ నిర్మితాలే" అనుకుంది.

లిఫ్టు ఆగగానే ముందు రేఖ సామానుతో బయటకు వచ్చి తలుపు తాళం తీసి లోపలకు నడిచింది. సీతమ్మ శేఖర్ వెంట లిఫ్టులోంచి బయటకు వచ్చి గుమ్మంవైపు అతని వెంటే నడిచింది.

"అమ్మా! ఇదే మన ఫ్లాటు 325 నెం॥ అన్నాడు శేఖర్. సీతమ్మ అటు, ఇటు చూసింది. ఎదురుగా ఒక గుమ్మం పక్కన మరో రెండు గుమ్మాలు ఆవిడకు తమ గుమ్మం పక్కన కనపడ్డాయి.

"శేఖర్! ఈ గమ్మాలన్నీ మనవేనా? ఆవిడ అమాయకంగా అడిగింది.

"కాదమ్మా! ఈ ఒక్క గుమ్మమే మనది. అవి మనలాంటి మరికొందరివి". శేఖర్ ఇంట్లో అడుగులేస్తుంటే ఆవిడకూడా నడిచింధి. ఆవిడ సామాను ఓ గదిలో పెట్టి ఈ గది నీదమ్మా!" అన్నాడు శేఖర్. గది విశాలంగానే ఉంది. ఓ పక్క పడుకోడానికి మంచం, మరో పక్క స్నానాల గది, అలమార్లకు తలుపులున్నాయి.

"గది బాగుంది. మీ ఫ్లాటు బాగుందిరా!" అంది సీతమ్మ.

రేఖ అంతలో వేడి వేడి కాఫీ పట్టుకొచ్చి సీతమ్మగారికి ఇచ్చింది.

"కాఫీ తాగి కాసేపు విశ్రాంతి తీసుకో అమ్మా!" శేఖర్, రేఖ గదితలుపులు దగ్గరపెట్టి వెళ్ళిపోయారు.

సీతమ్మ మంచంమీద పడుకోగానే నిద్రలోకి జారింది.

మరునాడు ఆదివారం.శేఖర్, రేఖ సీతమ్మగారిని అన్ని దేవాలయాలకు తీసుకు వెళ్లారు. బంధువుల ఇళ్లకు తీసుకువెళ్ళారు. రాత్రివేళ విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న నగరం సీతమ్మ కంటికి దేవలోకంలా అనిపించింది. మరో నాలుగు రోజులు సెలవుపెట్టి రేఖ, శేఖర్ తల్లికి ఆ చుట్టు పక్కలనున్న ముఖ్యమైన ప్రాంతాలన్నీ చూపించారు. ఆ సందడిలో సీతమ్మగారికి తన వూరు ఇల్లు గుర్తుకు రాలేదు.

ఆ రోజు సోమవారం. శేఖర్, రేఖ ఆఫీసులకి వెళ్ళాలి. టిఫెన్, కాఫీలు పూర్తయ్యాయి. వంటచేసి రేఖ టేబులు మీద సర్దింది.

"అమ్మా! మేము ఆఫీసుకు వెళుతున్నాం! సాయంకాలం వరకు రాము. నువ్వు వేళ కాగానే భోజనం చేసి విశ్రాంతి తీసుకో! ఎవరు వచ్చినా తలుపు తియ్యకు. ఈ కిటికి దగ్గరకు వచ్చి చూడు!" అంటు శేఖర్ ఒక జత తాళం చెవులు తల్లి చేతిలో పెట్టాడు. మరో తాళంతో బయట తాళం పెట్టి శేఖర్, రేఖ వెళ్ళిపోయారు.

తన యింటికి తాను వంటరిదే! కాని అది అలవాటైన ప్రాంతం. ఇది కొత్త ప్రాంతం. పైగా పట్నంలో మోసాలు ఎక్కువ. వచ్చిన తెలిసివచ్చింది. ఎవరి తలుపులు వాళ్ళు వేసుకునే ఉంటారు. ఏమిటో ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెడతారో తెలీదు. ఊరంతా సందడే! ఫ్లాటులో మనుషులూ కరువే వెలుతురూ కరువే! సూర్య చంద్రులు, వర్షమూ కూడా కరువే. "ఇది ఖరీదైన జైలు" అనుకుంది సీతమ్మ!

"అమ్మా! ఈ కాగితాలమీద సంతకం పెట్టమ్మా!" ఒకరోజు శేఖర్ వచ్చి తల్లిచేతికి కాగితాలు అందించాడు.

"ఈ కాగితాలేమిటిరా?" అడిగింది వాటిమీద ఇంగ్లీషుతో రాసి ఉండటంవల్ల ఆవిడ చదవలేకపోయింది.

"ఏం లేదమ్మా! నీ పేర ఇల్లు, భూములు ఉన్నాయిగా నేను బ్యాంకు లోను తీసుకుందామని" అన్నాడు. ఆ విడ చేత సంతకం పెట్టించుకుని మరీ వెళ్ళాడు.

"అమ్మా! మే మిద్దరం కాంపుకి వెళ్ళాలి! నీకేం భయం లేదు. పిన్ని వచ్చి

ఉంటుంది. అసలు నిన్ను తీర్థయాత్రలకు తీసుకు వెళ్ళాలనుకున్నా! ఈ క్యాంపు వచ్చిపడింది" అన్నాడు బాధపడిపోతూ శేఖర్.

"నీ మొహం! నాలుగు నెలలైనా ఏ యాత్రలూ లేవు!" అనుకుంది మనస్సులో.

"అబ్బే! నేనన్నీ చూసా! మీరు వెళ్ళిరండి!" అంది. ఆ రాత్రికే ఆవిడకు జ్వరం ప్రారంభమయింది. రెండు రోజుల్లో వాళ్ళు తిరిగి వచ్చేటప్పటికి జ్వరం మరింత ఎక్కువయింది. డాక్టరికి చూపించి కొడుకు మందులు తెచ్చి యిచ్చాడు. ఊరందరికి చికెన్ గున్యా, సీతమ్మగారికి కూడా అదే అని చెప్పాడు డాక్టరు. పారసిటమల్ మాత్ర తప్ప మరే మందులు లేవన్నాడు. శేఖర్ వెళ్ళాక ఏ పిన్నీ ఆ యింటికి రానేలేదు. ఆవిడ ఆ విషయం ప్రస్తావించింది.

పదిరోజులు గడిచాయి. జ్వరం తగ్గింది. కాని కాళ్ళ వాపులు, చేతుల వాపులు, నొప్పులు పూర్తిగా తగ్గలేదు. పుష్యమాసం వచ్చేసింది.

"ఒరే అబ్బాయ్! ఇక నన్ను పంపించరా! అయినా రైతుకు కబురు చేసావా? ధాన్యం బస్తాలు సావిట్లో పెట్టి తిరిగి ఇంటికి తాళం పెట్టమను లేకపోతే ప్రమాదంరా! పల్లెల్లోను దొంగలున్నారురా!

"రైతుకు కబురు పెట్టా! తప్పకుండా సావిట్లోనే పెట్టిస్తానని అన్నాడు. అతని మాటల్లో జీవం లేదని ఆ తల్లి కనిపెట్టింది.

"ప్రయాణం సంగతేమైందిరా?" తిరిగి సీతమ్మ అడిగింది.

"కంగారేముంది? అయినా పంపించేస్తాలే" అన్నాడు. ఆవిడ మనసు కాస్త కుదుట పడింది.

ఒక రోజు సీతమ్మగారు కొడుకు, కోడలు ఆఫీసుకు వెళ్ళిన తరువాత వీధి తలుపు తీసింది. ఎదురింటి తలుపులు కూడా తీసి ఉన్నాయి. చంటిపిల్లాడు కాబోలు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. ఆయా కాబోలు ఎంత సముదాయించినా ఏడుస్తూనే ఉన్నాడు. సీతమ్మగారు వెళ్ళి ఆయాను పలకరించి పిల్లాడిని అందుకుంది. వాడు కాసేపు ఏడ్చి ఊరుకోగానే ఆవిడ పాలసీసాతో పాలుపట్టగానే వాడు నిద్రలోకి జారాడు. బాబు తల్లి, తండ్రి ఉద్యోగాలు చేస్తారని, సాయంకాలం 7.30 గం॥ లకి కాని రారని, ఆ పిల్లాడికి ఒకటిన్నర సం॥ వయసని తెలుసుకుంది. ఆవిడ చాలా బాధపడింది.

"ఆయా నేను ఇంట్లోనే ఉంటా! అవసరమైతే నన్ను పిలు. పిల్లాడిని ఆడిస్తా!"

అని చెప్పింది. ఆయా సరే నంది. సీతమ్మగారు ఇంట్లోకి వచ్చి తిరిగి తలుపు వేసుకుంది.

"చూసారా! మీ అమ్మగారు చేసిన ఘనకార్యం ఇంట్లో పడుండక ఈ గొడవలన్నీ ఏమిటండీ? నాకు తలతీసినట్లయింది. మీ అత్తగారు ఆయాగా పని చేస్తారా? అంటూ ఆ యెదురింటావిడ అడిగిందండీ!" అంటూ రేఖ కోపంతో చిందులేసింది. సీతమ్మ చాలా బాధపడింది.

"చాలు అల్లరి. మా అమ్మ వింటే బాగుండదు. శేఖర్ మందలించాడు. నాలుగు రోజులు పోయాక సీతమ్మ తిరిగి వెళ్ళిపోతానంది.

"తొందరెందుకమ్మా!" పంపిస్తాలే అన్నాడు శేఖర్. "వచ్చి వీళ్ళ చేతుల్లో చిక్కుకున్నా!" సీతమ్మ మరింత బాధపడింది. "అయినా చంటిపిల్లాడు ఏడుస్తున్నాడని వెళ్ళి ఊరుకోపెడితే పిల్లాడిని చూస్తావా? డబ్బిస్తానంటుందేమిటి? నేనావిడ కంటికి ఆయాలా కనబడుతున్నానా? ఈ పట్నంలో అంతా డబ్బుకే ముడి కదా!" ఆవిడ మనస్సు మరింత కుంగిపోయింది. ఆ రాత్రికి మరింత జ్వరం వచ్చింది. డాక్టర్‌కి చూపించాడు శేఖర్. నాలుగు రోజులయినా తగ్గలేదు. పైగా అక్కడా యిల్లు, పొలం ఏమయ్యాయో? ఆమెలో ఏదో తెలియని బెంగ బయలుదేరింది. కొడుకు కోడలు దగ్గరవున్నా ఆమెను ఒంటరితనం పీడించ సాగింది.

"మన వూరుకు తీసుకు వెళ్ళరా! నేనింక ఇక్కడ ఉండలేకపోతున్నా!" జ్వరంతో మూలుగుతున్న సీతమ్మ మాటలు జాలిగా ఉన్నాయి.

"అవునండీ మనం కొన్న ఆస్తుల రిజిస్ట్రేషన్ పేపర్లు వచ్చాయండీ! ఇంటర్‌నేషన్ విమానాశ్రయం వస్తుందని అందరు షెంషాబాదులో స్థలాలు కొంటున్నారుగా, మన స్థలం మంచి ధర పలుకుతుంది" అవి కోడలు మాటలు.

"ఆ పలుకుతుంది. మా అమ్మచేత సంతకాలు పెట్టించి ఆ భూమి అమ్మించేసావుగా! మా అమ్మకు తెలిస్తే ఎంత బాధపడుతుందో?" అని కొడుకు మాటలు. ఆ మాటలు విన్న సీతమ్మ గుండెల్లో రాయి పడింది. ఆ రాత్రికి మరింత జ్వరం పెరిగింది.

"ఈవిడ మనోవ్యాధితో బాధపడుతున్నారు. ఎందుకైనా మంచిది ఆవిడను పల్లెటూరికి తీసుకువెళ్ళండి. అయినా ఈ చికెన్‌గున్యాని నమ్మడానికి లేదు" అన్నాడు డాక్టర్.

మరునాడు ప్రాతఃకాలంలోనే తిరిగి కారులో తల్లిని తీసుకుని శేఖర్, రేఖ

పల్లెకు బయలుదేరారు. సంధ్యాసమయంలో ఆ యింటి ముందు కారు ఆగింది. పడమటిరాగంతో వెలుగుతూ సూర్యుడు అస్తమిస్తున్నాడు. పక్షులు కలకలారావాలతో ఆకాశంలో సందడి చేస్తూ ఎగురుతున్నాయి.

అప్పటికీ ఇంటి తలుపులు తీసి శుభ్రం చేసి ఉన్నాయి. ఇంటి ముందు పూలచెట్లుగాలికి ఊగుతూ స్వాగతం పలుకుతుంటే సీతమ్మగారిని సావిట్లో మంచంవేసి పడుకోపెట్టారు.

"శేఖర్ ధాన్యం బస్తాలు లేవేం? అయినా నాకు తెలుసురా! భూములు అమ్మేసావు. నువ్వు కాగితాల మీద సంతకం పెట్టించినప్పుడే పెట్లో దస్తావేజులు లేవని గ్రహించాను. సరేలే. ఇల్లు ఉంచావుగా!" అంది నవ్వుతూ. ఆ నవ్వులో జీవంలేదు. ఇల్లంతా కలయ జూసుకుంది. వచ్చిన బంధువులను, ఇరుగు పొరుగులను పలకరించింది. ఆమె మనస్సు కుదుట పడింది. కాని ఆమె ప్రాణాలు ఆమెను వదలి అనంత వాయువుల్లో కలిసిపోయాయి. కళ్ళు మూతలు పడ్డాయి. శరీరం అచేతనమై శీతలమై పోయింది. శరీరంతోపాటు సీతమ్మ మనస్సు శీతలమై గడ్డ కట్టేసింది.

"అమ్మను నేనే చంపుకున్నా!" శేఖర్ వెక్కి వెక్కి ఏడ్చాడు.

"ముసలివాళ్ళు ఎన్నాళ్ళు బతుకుతారు?" రేఖ సమాధాన పడింది.

"సీతమ్మ ప్రాణాలన్నీ ఇంటి మీదే ఉన్నాయి. కళ్ళారా చూసుకుని మరీ ప్రాణాలు వదిలింది" అనుకుంటూ వచ్చిన వాళ్ళంతా కన్నీళ్ళు పెట్టుకున్నారు.

*23-10-2006 - ఆకాశవాణి వివిధ భారతిలో ప్రసారం.*